క్లుప్తంగా

హెల్మెట్ లేని 23 మందికి జరిమానా



హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై అహరోన్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న 23 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై అహరోన్ తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ.. సోమవారం స్థానిక కాలేజీ రోడ్డు, పాత బస్టాండ్, దోర్నాల సెంటరు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. హెల్మెట్ కచ్చితంగా ధరించాలని ప్రచారం చేస్తున్నప్పటికీ పలువురు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే తరచూ తనిఖీలు చేస్తూ జరిమానా విధిస్తున్నామని ఎస్సై చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంఘాల నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

మార్కాపురం: పట్టణంలోని వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను శ్రీ విద్య కోచింగ్ సెంటరులో జేవీవీ నాయకులు వై.రవికుమార్, వెంకటరావు, విప్లవకుమార్, చక్కిళం శ్రీధర్ తదితరులు ఆవిష్కరించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను నూతన సంవత్సరంలో భర్తీ చేయాలని కోరారు. ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య, కార్యదర్శి హనుమంతరావు, మండల నాయకులు టీవీ రమణ, పగడాల మల్లికార్జునరావు, దీపక్, రాజారమేష్‌బాబు, నల్లబోతుల శ్రీనివాసులు, రంగస్వామిరెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురం: భోగి మంట వేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ, కుటుంబ సభ్యులు



గొట్లగట్టు హరిజన కాలనీలో కబడ్డీ ఆడుతున్న యువత



కొమరోలులో భోగి మంట వేస్తున్న దృశ్యం

- ఇళ్ల ముంగిట భోగి మంటలు
- సింగారించుకున్న రంగవల్లికలు

భోగి తెచ్చే భాగ్యం



కంభాలపాడులో ఇంటి వద్ద హరిదాసుల కీర్తనలు

సాక్షి నెట్‌వర్క్: సంక్రాంతి సంబరాలు సోమవారం భోగి మంటలతో ప్రారంభమయ్యాయి. పండుగను స్వాగతిస్తూ తెలుగు లోగిళ్లు ముస్తాబయ్యాయి. ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు వేస్తూ తెలుగింటి ఆడపడుచులు సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. కూలి పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, పట్టణాల్లో చదువుతున్న, ఉద్యోగాలు చేస్తున్న వారు, కొత్త అల్లుళ్ల రాకతో గ్రామాల్లో సందడి నెలకొంది. పలు గ్రామాల్లో ఆటల పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులు గాలి పటాలు ఎగరవేస్తూ సందడి చేశారు.

- మార్కాపురం పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ తదితరుల నివాసాల వద్ద భోగి మంటలు వేసి సందడి చేశారు.
- కంభం మండల కేంద్రంతోపాటు యర్రబాలెం, కందులాపురంలో పలు చోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
- పొదిలి మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. మాదాలవారిపాలెం గ్రామంలో కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. బేస్తవారిపేట మండలంలో సంక్రాంతి వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే భోగి మంటలు వేయడంతోపాటు చిన్నారులకు భోగి పండ్లు పోసి సుఖ సంతోషాలతో ఉండాలని పెద్దలు ఆశీర్వదించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, అర్ధవీడు, తర్లుపాడు మండలాల్లోనూ భోగి మంటలు వేసి చిన్నాపెద్ద సందడి చేశారు.



కంభం మండలం యర్రాబాలెంలో ప్రథమ బహుమతి సాధించిన ముగ్గు



యర్రబాలెంలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులిస్తున్న నాయకులు



బ్రాహ్మణపల్లిలో గాలి పటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



గొట్లగట్టులో ఇంటి ముందు రంగవల్లికలు

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



రామదూతక్షేత్రంలో గోదాదేవి కల్యాణం

మార్కాపురం టౌన్: ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం మార్కాపురం పట్టణంలోని లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఊటుకూరి రామకృష్ణ, చక్కా మాలకొండ నరసింహారావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొదిలి: స్థానిక విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రుని ఆలయంలో గోదాదేవి కళ్యాణోత్సం వైభవంగా సాగింది. కల్యాణ ఉభయదాతలుగా బొగ్గవరపు శ్రీనివాసులు, లక్ష్మిల కుమార్తె, అల్లుడు వ్యవహరించారు. ముందుగా ఆలయ నిర్మాణ దాత మాజీ ఎంపీపీ వేంపాటి పోలిరెడ్డి, రమణమ్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు.

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో సోమవారం భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం నిర్వహించారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ పలువురు ఉభయ దాతలు పాల్గొని గోదాదేవి కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ సభ్యుడు యక్కంటి తిరుపతిరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సంపాదకునిగా వెంకట రత్నం సేవలు అమూల్యం



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

పొదిలి: ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రారంభంలో సంపాదకునిగా మైనేని వెంకట రత్నం అందించిన సేవలు అమూల్యమైనవని యూటీఎఫ్ నాయకులు కొనియాడారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో వెంకటరత్నం వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థి లోకానికి ఉపయుక్తంగా ఉండేలా పత్రిక నడిపారన్నారు. సంఘం బలపేతం అయ్యేందుకు పత్రిక కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు, జిల్లా మాజీ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సానికొమ్ము సత్యనారాయణ రెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బూదాల బుజ్జిబాబు, వెన్నెల మల్లికార్జున్, బతుకమ్మ సురేష్, షేక్.సుభాని, బాలకాశిరెడ్డి, ఓబులరెడ్డి, మోహనరావు, విజయగోపాల్, గంట ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

తర్లుపాడు: స్థానిక లూథరన్ చర్చి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి ఆదాము పలు గృహ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథులుగా గుంటూరుకు చెందిన సంఘ బిషప్‌లు జంగాల ప్రభాకర్‌రావు, జనుమాల బజయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక సంఘ నాయకులు ఈ.వెంకటయ్య, ఎం.రాజ్‌కుమార్, సీహెచ్ చిన్ని, చల్లగాలి చెన్నయ్య, డి.ప్రసాద్, ఎం.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శివకోటి పూజలు

మార్కాపురం టౌన్: శివకోటి పుణ్యదినాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయం, షిరిడీ సాయిబాబా మందిరంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఉపాలయంలో పరమేశ్వరుడు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు రవిశర్మ పూజలు నిర్వహించగా మందిరం అధ్యక్ష కార్యదర్శులు గోపాలుని హరిహరరావు, పేరం సత్యనారాయణ, కోశాధికారి నాగరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం ఉత్తర ద్వారంలో మహాదేవుడు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం నగరోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ప్రధాన అర్చకులు వేలూరి ఆంజనేయశర్మ, అర్చకులు వరుణ్‌తేజ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరద్వారంలో దర్శనమిస్తున్న ఆది దంపతులు



మార్కాపురంలో మహాదేవుని నగరోత్సవం

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

మార్కాపురం: పెరిగిన విద్యుత్ బిల్లులు, అదనపు చార్జీల భారాన్ని ప్రభుత్వం ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.సోమయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సోమవారం విద్యుత్ బిల్లులను భగత్‌సింగ్ కాలనీ, డ్రైవర్స్‌కాలనీ, రాజ్యలక్ష్మికాలనీ, మున్సిపల్ ఆఫీసు వద్ద భోగి మంటల్లో వేసి కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రూఅప్, ఫిక్స్‌డ్ ఎనర్జీ తదితర పేర్లతో వేసిన అదనపు చార్జీలను రద్దు చేయాలన్నారు. విద్యుత్ సంస్థల నష్టాలకు ప్రభుత్వమే కారణమని, ప్రజలపై అదనపు భారం వేయడం మంచి పద్ధతి కాదన్నారు. కూటమి ప్రభుత్వంలో అదనపు చార్జీలు, విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి తుంగలోకి తొక్కారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రఫీ, సభ్యులు జవ్వాజి రాజు, నన్నేసా, మహబూబ్‌బాషా, మల్లిఖార్జున, రెహానా, కరీముల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: పెంచిన అదనపు విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని మండల సీపీఎం నాయకులు పిల్లి బాలనరసయ్య డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర పార్టీ కమిటీ పిలుపు మేరకు సోమవారం పెంచిన విద్యుత్ చార్జీల బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలపై అదనపు భారాన్ని మోపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



మార్కాపురం : భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు



కంభంలో కరెంటు బిల్లును భోగి మంటల్లో కాలుస్తూ..



కొనకనమిట్లలో..

కంభం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరెంటు బిల్లులు విపరీతంగా పెంచేసి సామాన్యుడి నడ్డి విరిచిందని సీఐటీయూ నాయకుడు అన్వర్‌బాషా విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ సోమవారం భోగి మంటల్లో బిల్లుల ప్రతులు దహనం చేశారు. ట్రూ అప్ చార్జీలు, సర్ చార్జీలు తొలగించి కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

నేడు సంక్రాంతి ముగ్గుల పోటీలు

తర్లుపాడు: స్థానిక శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు వేణుగోపాలస్వామి దేవస్థానం వద్ద సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు భజన మండలి కన్వీనర్ బి.రామకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకుని రసీదు పొందాలని సూచించారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

కంభం: ఎస్సీల శ్మశాన వాటికలో సోమవారం నూతన బోరును ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.2.5 లక్షలు వెచ్చించి ఎస్సీల శ్మశానవాటికలో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, బత్తుల సూర్యప్రకాష్, ఎమ్మార్పీయస్ నాయకులు పానుగంటి షాలెంరాజు, నేదరపల్లి జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



డీప్ బోరును ప్రారంభిస్తున్న ఎంపీపీ తులశమ్మ

పాస్టర్లు ఐకమత్యంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు

మార్కాపురం: పాస్టర్లందరూ ఐకమత్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డాక్టర్ పురుషోత్తం కోరారు. సోమవారం మార్కాపురం టౌన్, రూరల్, డివిజన్ గ్రేస్ పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. అందరూ కలిసిమెలసి ఉంటూ ఆధ్యాత్మిక భావనతో జీవించాలన్నారు. పాస్టర్ల సంఘ అధ్యక్షుడు తంగిరాల ఇరిమ్మియా మాట్లాడుతూ పట్టణంలో శ్మశాన వాటిక సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, పాల్‌రాజ్, జె.జాన్, దేవయ్య, పీటర్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పండగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: గ్రామాల్లో ఎటువంటి గొడవలు లేకుండా సంక్రాంతి పండగ నిర్వహించుకోవాలని ఎస్సై ఎస్పీ రవీంద్రారెడ్డి సూచించారు. సోమవారం పందిళ్లపల్లె గ్రామంలో క్రికెట్ పోటీలను ఎస్సై ప్రారంభించారు. పందిళ్లపల్లె గ్రామంలో కొన్నేళ్లుగా సంక్రాంతి సంబరాలను గ్రామస్తులంతా కలిసి నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. ఆటల పోటీలు స్నేహాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.